# శ్రీ దుద్దిళ్ళ శ్రీపాదరావు

శ్రీ దుద్దిళ్ల శ్రీపాదరావు తొమ్మిదవ శాసనసభ (1989-1994) స్పీకరుగా 1991వ సంవత్సరము ఆగస్టు 19వ తేదీన ఏకగ్రీవంగా ఎన్నికై 1995వ సంవత్సరము జనవరి 11వ తేదీ వరకు ఆ పదవిని నిర్వహించారు. వీరి హయంలో 1993-94వ సంవత్సరంలో మొదటి సారిగా మహిళా శిశు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసారు.

వీరు 1939వ సంవత్సరం నవంబరు 6వ తేదీన కరీంనగర్ జిల్లా మంథని గ్రామంలో జన్మించారు.

వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎల్.ఎల్.బి. పూర్తిచేశారు. 1958-1960 సంవత్సరాల మధ్యకాలంలో ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ పంచాయతీ సమితి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తూ, ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలలో చేరారు. 1964లో ధన్వాడా గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, 1965-1969 సంవత్సరాల మధ్య కరీంనగర్ డిస్ట్రిక్ట్ లైబ్రరీ అథారిటీ సభ్యునిగా, 1965 నుండి 1983 వరకూ మంథని వ్యవసాయాభివృద్ధి బ్యాంకు అధ్యక్షునిగా, 1980 నుండి 1985 వరకూ మహాదేవపూర్ పంచాయతీ సమితి ఉపాధ్యక్షునిగా, ధన్వాడా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షునిగా, టుబాకో బోర్డు మెంబరుగా పనిచేశారు.

శ్రీ శ్రీపాదరావు 1983వ సంవత్సరంలో ఏడవ శాసనసభకు, 1985వ సంవత్సరములో ఎనిమిదవ శాసనసభకు, 1989వ సంవత్సరంలో తొమ్మిదవ శాసనసభకు కరీంనగర్ జిల్లా మంథని నియోజవర్గం నుండి శాసనసభ్యుడిగా ఎన్నికైనారు. గ్రంథాలయ కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ మరియు అంచనాల కమిటీలలో సభ్యునిగా ఉన్నారు.

వీరు న్యూఢిల్లీలో 1991వ సంవత్సరములో జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంటరీ సమావేశంలోనూ, 1992వ సంవత్సరములో జరిగిన అఖిల భారత స్పీకర్ల సమావేశంలోనూ పాల్గొన్నారు.

శ్రీ శ్రీపాదరావుగారిని 1999వ సంవత్సరం ఏప్రిల్ పదమూడవ తేదీన నక్సలైట్లు కాల్చిచంపారు. వీరు చేసిన సేవలకు గుర్తింపుగా గౌరవ భావంతో కరీంనగర్ జిల్లాలోని ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకానికి వీరి పేరు పెట్టడం జరిగింది.

వీరు శాసనసభ స్పీకరుగా మృదు స్వభావంతో వ్యవహరించి అందరి మన్ననలను పొందారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకే సార్వభౌమాధికారం ఉంటుందని, ప్రజలు ఆ అధికారాన్ని చట్టసభల సభ్యుల ద్వారా వినియోగించుకుంటారని, ప్రభుత్వ విధానాలు చట్టసభలలో జరిగే చర్చల ద్వారానే రూపొందుతాయని, ప్రభుత్వ విధానాల తీరు తెన్నులను తెలుసుకొనే అధికారం ప్రజాప్రతినిధులకు ఉంటుందని, కనుక ప్రజాప్రతినిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించడం ప్రభుత్వ అధికారుల కర్తవ్యమని, ఈ విషయంలో ప్రజాప్రతినిధుల ప్రాధాన్యతను తగ్గించివేయటం ఎంతమాత్రం సమర్థనీయం కాదని శ్రీ డి. శ్రీపాదరావు 1994, మార్చి 15వ తేదీన రూలింగులో విశదం చేశారు.

## శ్రీ శ్రీపాదరావు స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

మీరందరు అభిమానంతో నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నదానికి నా కృతజ్ఞతలు. ఇంకా చాల మంది పెద్దలు రజబలీగారు ఇతర పెద్దలు చాలా మంది మిగిలిపోయారు. ఇంక సమయం లేదు కాబట్టి ఇంకా మీ అందరికి సమయం కేటాయించనందుకు క్షమించమని కోరుతూ ఉన్నాను. ముఖ్యమంత్రిగారు ఎప్పుడైతే నా పేరు ప్రతిపాదించి నన్ను నామినేషను వేయాలి అని అన్నారో అప్పుడే మెయిన్ అప్పోజిషన్ లీడర్సు, ఫ్లోర్ లీడర్సు, అప్పోజిషన్ మెంబర్లు మాతోటి కాంగ్రెసు శాసనసభ్యులు అందరు సహకరించి నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకోడానికి నా పైన చూపిన అప్యాయతకు అందరికి నేను నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను. నేను మీలో ఒకడిని. నిమిత్త మాత్రుడిని అని చెప్పడంలో నేను వెనుకంజవేయడం లేదు. ముఖ్యమంత్రిగారు నన్ను నామినేషన్ వేయమన్నప్పుడు శ్రీపాదరావుకి ఇస్తే అప్పోజిషన్ లీడర్సు అందరికి ఆమోదయోగ్యముగా ఉంటుంది అన్న వాచ ఏదైతే వచ్చిందో అది నాకు కొంత బలము చేకూర్చినట్లు అయింది. అప్పోజిషన్ లీడరుగా ఉన్న ఎన్.టి. రామారావుగారి ఆశీర్వచనం కావాలని నేను, రామచంద్రారెడ్డిగారు వారి దగ్గరకు వెడితే ఎంతో గౌరవప్రదంగా ఆహ్వానించి లోపలికి తీసుకువెళ్లి నన్ను నామినేషన్ చేయమని ప్రతిపాదించారు. సామాన్యంగా అప్పోజిషన్ వారు సపోర్టు చేయుట జరుగుతుంది గాని ప్రతిపాదించడం జరగదేమో అన్న అపోహను తొలగించిన అప్పోజిషన్ లీడర్లు అందరికి, శాసన సభ్యులందరికి నేను నా కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను. ఏది ఏమైనా ఎవరైనా ఒకరు సభాపతిగా, మంత్రులుగా ఎం.ఎల్.ఏలుగా ఉన్నవారిలో నుంచి ఎవరో ఒకరు కావలసిందే. నేను ఇంత పెద్దవాడినా నాకు అంత క్యారక్టరు ఉందా అని ఆశ్చర్యపోతూ నా మీద చూపిన ఈ అప్యాయతకు ఆనందబాష్పాలు రాలుస్తున్నాను అని చెప్పితే అతిశయోక్తి కాదని మనవిచేస్తున్నాను. నాకు ఒకటే యాదికి ఉంటుంది ఢిల్లీకి రాజు అయినా తల్లికి కొడుకునే అని. నేను సభాపతి అయినా ఒక సేవకుడనే. ఈ వేళ ఈ స్థానంలో ఉంచవచ్చు. రేపు ఎక్కడో ఉండవచ్చు, దేశాన్ని కాపాడుతాము అని మనం అనుకున్ననాడు, ఈ సాంప్రదాయాలు అన్ని మనకు సౌలభ్యముగా నిర్మాణం చేసుకున్ననాడు, ఈ దేశం బాగుపడుతుందేమో

అనుకునే వారిలో మీ తీరుగానే నేను ఒకడిని అనుకుంటున్నాను. మీరు చూపిన అప్యాయతకు నా కృతజ్ఞతలు అని చెపుతున్నాను. మరి డెమొక్రటిక్ నార్మ్స్ మీద కూడా చెప్పవలసి ఉంది. ఈ సభలో మీరు అంతా చూసే ఉంటారు. ఒక విధంగా పోడియమ్ ముందుకు రావడం, ఆ కాలములోగాని, ఈ కాలములోగాని, ఏ పార్టీగాని మైకులను ఇప్పుడే అనడం లేదు, ఆనాటి నుంచి ఈనాటి వరకు జరుగుతున్నాయి. మీరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు, చాలా సమయం తీసుకుందాము అనుకున్నాను గాని సమయం లేదు, పెద్దలందరికి ప్రత్యేకంగా నన్ను నామినేట్ చేసిన గౌరవనీయ పెద్దలు ముఖ్యమంత్రిగారికి, ప్రత్యేకంగా హైకమాండ్ నుంచి వచ్చిందని, చెప్పిన హైకమాండ్ నేతలకు, ఈ ప్రక్క నుంచి ఎన్.టి. రామారావుగారికి, నాగేశ్వరరావుగారికి, వెంకటేశ్వరరావు గారికి, విద్యాసాగరరావుగారికి, నర్సిరెడ్డిగారికి, అమానుల్లాఖాన్‌గారికి, జగపతిరావుగారికి, జె.కె. రెడ్డిగారికి, ఓమ్‌కార్‌గారికి, అందరికి, మరి ప్రతిపాదించి సంతకం పెట్టినప్పుడు మీరు అప్యాయత చూపించినట్లు కాకుండా నన్ను ఈ సేవకునిగా, సభాపతిని చేసినందుకు నా ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతూ నేను ఈ పదవిలో ఉన్నంత కాలములో మీరు ఏ గౌరవం చూపించారో ఆ గౌరవానికి బద్ధుడినయి ఉంటానని మరొకసారి మీ అందరికి మనవి చేస్తున్నాను. సభ ఇంతకు పూర్వం ఏ విధంగా ఉన్నది అని నేను అనకుండా అటువంటి పదజాలముతో కాకుండా ఇంకా ఏ విధమైనటువంటి అభ్యంతరాలు రాకూడదని నేను అందరితో మనవిచేస్తున్నాను. శాసనసభ గౌరవాన్ని అవతల చూస్తున్నారు. మనము ఏమి అనుకుంటున్నాము, అట్టడుగున ఉన్న బలహీనవర్గాలకు ఏమి సేవ చేస్తున్నాము, లేక అసెంబ్లీకి వచ్చి పోడియం దగ్గరో, అక్కడో ఇక్కడో పోట్లాడుతున్నామని, ప్రజలు చాలా మటుకు అనుకుంటున్నారు. గ్రామ పంచాయతీ మీటింగే బాగా జరుగుతోందని అని, ఆ భావనను తొలగించాలని మీ అందరితో మనవి చేస్తూ మీరు చూపిస్తున్న అప్యాయతకు ఎప్పుడూ బద్ధునిగా ఉంటానని, సేవకునిగా ఉంటానని మనవి చేస్తూ మీరు చూపించిన గౌరవానికి మరొకసారి నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ శెలవు తీసుకుంటున్నాను.